# ఆస్తుల జప్తుపై సింగిల్ జడ్జి తీర్పు రద్దు

- ఈడీ అప్పీలును ఆమోదించిన హైకోర్టు డివిజన్ బెంచ్

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): నేరపూరిత ఆస్తులకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చేసిన తాత్కాలిక జప్తును ధ్రువీకరించే అడ్జుడికేటింగ్ అథారిటీలో జ్యుడిషియల్ సభ్యులు ఉండాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. సాంకేతిక సభ్యుడు ఇచ్చిన ఉత్తర్వులు, ఈడీ జప్తు చర్యలు చెల్లవని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. కార్వీ గ్రూపు కంపెనీలతోపాటు పలు ఇతర కంపెనీల ఆస్తుల తాత్కాలిక జప్తును ధ్రువీకరిస్తూ అడ్జుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులు చెల్లవన్న సింగిల్ జడ్జి తీర్పునకు వ్యతిరేకంగా ఈడీ దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం ఆమోదించింది.

# శ్రీవారి హుండీకి 5.48 కోట్ల ఆదాయం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): తిరుమల శ్రీవారి హుండీకి మరోసారి కాసుల వర్షం కురిసింది. చాలారోజుల తర్వాత సోమవారం రికార్డు స్థాయిలో రూ.5.48 కోట్ల ఆదాయం వచ్చింది. ఆ రోజు 69,314 మంది భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు. 25,165 మంది తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకొన్నారు. ఏకంగా 20 కంపార్ట్‌మెంట్‌లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. కాగా, ఈ నెల 24న కుమారధార తీర్థ ముక్కోటి ఘనంగా నిర్వహించనున్నట్టు టీటీడీ అధికారులు వివరించారు.

# తెలంగాణ శాస్త్రవేత్తకు అరుదైన అవకాశం

- అమెరికన్ ఆర్మీ మెడికల్ రిసెర్చ్ సెంటర్‌తో కలిసి పనిచేయనున్న బుట్టి రమేశ్
- మూత్రపిండ క్యాన్సర్‌పై పరిశోధన

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందిన బయోటెక్నాలజీ శాస్త్రవేత్త బుట్టి రమేశ్‌కు అరుదైన అవకాశం లభించింది. రెనల్ సెల్ కార్సినోమా (మూత్రపిండ క్యాన్సర్) ప్రాజెక్టులో భాగంగా ఆయన అమెరికన్ ఆర్మీ మెడికల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో కలిసి పరిశోధనలు చేయనున్నారు. వరంగల్ జిల్లాలోని గువిచెర్లకు చెందిన రమేశ్ బయోటెక్నాలజీలో హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి పీజీ పట్టా పొందాక సీఎస్ఐఆర్ ఫెలోషిప్‌ను సాధించారు. బ్రెస్ట్ ట్యూమర్‌పై పుణెలోని నేషనల్ సెంటర్ ఫర్ సెల్ సైన్సెస్‌కు చెందిన ప్రముఖ బయాలజిస్టు గోపాల్ కుందు సారథ్యంలో అధ్యయనం చేసిన రమేశ్ 2020లో డాక్టరేట్‌ను పొందారు. ఆ తర్వాత ఆయన సౌత్‌వెస్టన్ మెడికల్ సెంటర్‌లోని ల్యాబొరేటరీ ఆఫ్ జేమ్స్ బ్రూగారోలాస్‌లో శాస్త్రవేత్తగా సేవలు అందించడంతోపాటు కిడ్నీ క్యాన్సర్ రిసెర్చ్ సెంటర్‌లో కీలక బాధ్యతలు నిర్వహించారు. బయోటెక్నాలజీ రంగంలో విశిష్ట సేవలు అందిస్తుండటంతో రమేశ్‌కు ప్రతిష్ఠాత్మక యూఎస్ ఆర్మీ మెడికల్ రిసెర్చ్ సెంటర్‌తో కలిసి పని చేసే అవకాశం లభించింది.

















